క్లుప్తంగా

కేరళ అర్బన్ కాన్‌క్లేవ్‌కు హాజరైన మేయర్



నెహ్రూనగర్: కేరళ రాష్ట్రంలోని కోచిలో ఈ నెల 12, 13 తేదీలలో నిర్వహించిన అర్బన్ కాన్ క్లేవ్ సదస్సులో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు. నగర పాలక సంస్థలలో, పట్టణాలలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనపై పట్టణాభివృద్ధి నిపుణులు వివరించినట్లు చెప్పారు. ఈ కాన్ క్లేవ్‌కు గుంటూరు నగరానికి ఆహ్వానం అందటం గర్వకారణమన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల మున్సిపల్ మేయర్లు, కమిషనర్లు, పట్టణాభివృద్ధి నిపుణులు పాల్గొని, నగర పాలక సంస్థలు, పట్టణాల అభివృద్ధి, స్మార్ట్ సిటీ మోడల్స్, పచ్చదనం, పారదర్శక పరిపాలన, పౌర సేవల డిజిటలైజేషన్ వంటి అంశాలపై చర్చించడం జరిగిందని మేయర్ వివరించారు.

డిజిటల్ మహిళా సంస్థ ఆవిర్భావం



గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని మహిళలు తమ ఇంట్లో నుంచే వారిలోని నైపుణ్యానికి తగిన విధంగా శక్తి, సంపద, స్వేచ్ఛను సాధించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా డిజిటల్ మహిళా అనే సంస్థను ఏర్పాటు చేశారు. శనివారం బ్రాడీపేటలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఆశ్లేష ఈదల మాట్లాడుతూ గృహిణులుగా ఇంటిని, కుటుంబాన్ని తీర్చిదిద్దే మహిళలు తమ ఇంటి నుంచే ఆదాయాన్ని సంపాదించడంపై అవగాహన కల్పించేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా డిజిటల్ మహిళా అనే సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఎంఎస్ భవిత పేరుతో యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో సంస్థ అధిష్టాన్ సభ్యులుగా దేవీరెడ్డి, పూర్వజ, నాగశ్రీ, వాణి పోలూరి, మాధవితో పాటు సంఘ మిత్ర సభ్యులుగా మరో 55 మందిని చేర్పించారు.

గుంటూరు నగర అభివృద్ధిపై సమీక్ష

నెహ్రూనగర్: నగర అభివృద్ధిపై మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణతో పాటు గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, నగర కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కుంచనపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. రూ.120 కోట్లతో ఇన్నర్ రింగ్ రోడ్డు అసంపూర్తి పనులు, స్టాం వాటర్ డ్రెయిన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. గోరంట్ల ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు అమృత్ 2.0 టెండర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీఆర్‌డీఏ ఇంజినీరింగ్ చీఫ్ కృష్ణారెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు అమరులను స్మరించుకోవాలి

లక్ష్మీపురం: దివంగత మామిళ్లపల్లి మాలకొండయ్య, గుర్రం బ్రహ్మయ్య సంస్మరణ సభ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు శారదా కాలనీ స్థూపం సెంటర్‌లో నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో 48వ డివిజన్ శాఖ కార్యదర్శి విరిగినేని వెంకటేశ్వరరావు, 50వ డివిజన్ శాఖ కార్యదర్శి దండు రవి, మామిళ్లపల్లి మాలకొండయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పిడుగు పాటు బాధితులను ఆదుకోవాలి

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా వ్యాప్తంగా శనివారం కురిసిన భారీ వర్షాలకు పిడుగులు పడి మృతి చెందిన రైతు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియ కింద రూ.5 లక్షలు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిలా కార్యదర్శి ఈమని అప్పారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పిడుగులు పడి పెదనందిపాడు మండలం అన్నపర్రు, పెదకాకాని మండలం నంబూరులో వ్యవసాయ కూలీలు చనిపోవడం జరిగిందని తెలిపారు. కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

• జలమయం

వర్షం నగరాన్ని ముంచెత్తింది. రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా పడింది. నగరంలోని రోడ్లు జలమయం అయ్యాయి. వాహన చోదకులు అవస్థలు పడ్డారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



పీకలవాగు ఉధృతి



ఏటీ అగ్రహారం 4వ లైన్‌లో రోడ్డు పరిస్థితి



మూడు వంతెనల వద్ద వాహనదారుల అవస్థలు

ఉత్తమ సమాజ స్థాపన దిశగా నడుం బిగించాలి



సన్మాన గ్రహీతలతో జోసఫ్ సుధీర్‌బాబు, ఎస్టీయూ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉత్తమ సమాజ స్థాపన దిశగా ఉపాధ్యాయులు నడుం బిగించాలని అఖిల భారత సెకండరీ టీచర్స్ ఫెడరేషన్(ఏఐఎస్టీఎఫ్) జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు పేర్కొన్నారు. శనివారం కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఇటీవల గుంటూరుజిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్న వారిలో 40 మందికి రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. గుంటూరు డీవైఈఓ జి.ఏ సురత్నం మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో కెల్లా పవిత్రమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులు ఎంతో ధన్యులని, వెలుగుతున్న దీపం మరొక దీపాన్ని వెలిగిస్తుందనే సూక్తిని నిజం చేస్తూ ఉపాధ్యాయులందరూ ఎల్లప్పుడు నూతన జ్ఞానంతో విద్యార్థులకు బోధన చేయాలని అన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జోజప్ప, ఆర్థిక కార్యదర్శి ఎల్.వీరాంజనేయులు, మాజీ ఉపాధ్యక్షులు ఇ.అంబరీషుడు, మేడికొండూరు ఎంఈఓ-2 అబ్దుల్ అలీం, సీనియర్ నాయకులు కె.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఎండీ నజీర్, కె.వి జయబాబు, వై శ్యాంబాబు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇస్తామని చెప్పిన హామీలను నెరవేర్చాలని కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సుమన్ డిమాండ్ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సమావేశం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈదులమూడి మధుబాబు అధ్యక్షత శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మేలు జరుగుతుందని ఆశించినప్పటికి ఎటువంటి ఫలితం లేదన్నారు. ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చినప్పటికి దానిని ఇంత వరకు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ముఖ్య నాయకులు సంగీతరావు, కిరణ్‌కుమార్, శ్యాంప్రసాద్, శివసైదారావు, గంట సంపత్‌కుమార్, సుధీర్‌కుమార్, రామ్‌భద్ర, నీరజ, కోటేశ్వరరావు, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

సంగీత, నృత్య, సాహిత్య రంగాల్లో కృషి అభినందనీయం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

నగరంపాలెం: సంగీత, నృత్య, సాహిత్య రంగాల్లో చిన్నారులను తీర్చిదిద్దడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. కేఆర్‌కేఎం మెమోరియల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ ఏపీ సంయుక్తంగా బృందావన్‌గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పద్మావతి కళ్యాణవేదికపై నిర్వహిస్తున్న అమరావతి నాట్యోత్సవం- 25 శనివారం రెండో రోజుకి చేరింది. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కోకా రాధాకృష్ణమూర్తి పేరుపై ఫైన్ ఆర్ట్స్ అకాడమీ స్థాపించి, దేశ విదేశాల్లో కోకా విజయలక్ష్మి అందిస్తున్న లలిత కళా సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, గెట సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ వెలివేటి మురళి, అభినయ థియేటర్ ట్రస్ట్ నిర్వాహకులు అభినయ శ్రీనివాస్, దేవస్థానం సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నాట్య విశారద కోకా విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన

గుంటూరు మెడికల్: స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల, విశ్వ ఆయుర్వేద పరిషత్, శ్రీ కంచి కామకోటి పీఠ హరిహర దత్త క్షేత్రం, స్నిగ్ధ ఆయుర్వేదిక్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో మెగా ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. పట్టాభిపురం రవీంద్ర నగర్‌లో శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు గోపాలన్ మాట్లాడుతూ స్థూలకాయం తగ్గించేందుకు ప్రధాని మోదీ సూచనల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే సలహాలు చెప్పే వ్యక్తి వైద్యం, అర్హత తెలుసుకొని పాటించాలన్నారు. వైద్య అర్హతలేని వారు చెప్పే ఆరోగ్య సలహాలు పాటించరాదని సూచించారు. కార్పొరేటర్ వర ప్రసాద్ మాట్లాడారు. స్నిగ్ధ ఆయుర్వేద ఫౌండర్ డాక్టర్ చైతన్య వైద్య శిబిరానికి వచ్చిన వారికి మూడు నెలల వరకు ఉచిత కన్సల్టేషన్, మందులలో 20 శాతం రాయితీ, పంచకర్మ చికిత్సలో 25 శాతం రాయితీ కల్పించారు. శిబిరంలో డాక్టర్ సుదర్శన్ వేదాంతం, డాక్టర్ భవ్య శ్రీ, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఎస్.హర్ష, కంచి కామకోటి పీఠ హరిహర దత్తక్షేత్రం చైర్మన్ గణపతి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కొత్తరెడ్డిపాలెంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి

లక్ష్మీపురం: చేబ్రోలు శివారు కొత్తరెడ్డిపాలెంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గుంటూరు శివారు ప్రాంతం తురకపాలెం అసాధారణ మరణాలకు ఇంత వరకు స్పష్టమైన కారణాన్ని ప్రభుత్వం కనిపెట్టలేకపోయిందని వివరించారు. ఈ ఘటన మరవక ముందే అవే లక్షణాలతో చేబ్రోలు గ్రామం శివారు ప్రాంతం కొత్తరెడ్డిపాలెంలో నిన్న ఆశ వర్కర్ మరణించిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి.ముత్యాలరావు, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

నెహ్రూనగర్: స్వచ్ఛ భారత్ మిషన్ బృందం ఈ నెల 16న గుంటూరు పర్యటన దష్ట్యా గుంటూరు నగర పాలక సంస్థకు చెందిన కళ్యాణ మండపాలు, కమ్యూనిటీ హాల్స్ బహిరంగ వేలాన్ని వారం రోజులు వాయిదా వేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో వేలం జరిగే తేదీలని ప్రకటిస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి సహకరిస్తాం

గుంటూరు వెస్ట్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా నూతన కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్య నారాయణ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషా, జిల్లా కార్యదర్శి కేవీఎస్ శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి , రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి సుమిత్రా దేవి పాల్గొన్నారు.

దుకాణాల సూచిక ఫలకాలు తెలుగులో ఏర్పాటుకు సహకరించాలి

నగరంపాలెం: గుంటూరులో నెలకొన్న దుకాణాల సూచిక ఫలకాలు తెలుగులో ఏర్పాటుకు సహకరించాలని ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. జిన్నాటవర్ కూడలిలోని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీ) కార్యాలయంలో శనివారం శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 3- 5 తేదీల్లో గుంటూరులోని మూడో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పి.రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

రైతు బజారు సూపర్‌వైజర్ గుండెపోటుతో మృతి



రవివర్మ(ఫైల్)

కొరిటెపాడు(గుంటూరు): నగరంలోని చుట్టుగుంట రైతుబజార్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న టి.రవివర్మ గుండెపోటుతో మృతి చెందారు. విధుల్లో భాగంగా శనివారం ఉదయం కర్నూలు నుంచి వచ్చిన ఉల్లిపాయల బస్తాలను దిగుమతి చేయిస్తూ బాత్ రూమ్ వస్తుందని ఉదయం 9.15 గంటల ప్రాంతంలో టాయిలెట్స్‌కు వెళ్లారు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు స్థానికులు చెప్పారు. రవివర్మ 2017 నుంచి ఆర్‌టీసీ బస్టాండ్ రైతుబజారు, పట్టాభిపురం రైతుబజారు, చుట్టగుంట రైతుబజారులలో సూపర్ వైజర్‌గా పనిచేస్తూ మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల నుంచి మంచి ప్రశంసలు పొందారు. రవివర్మ స్వస్థలం పల్నాడు జిల్లా పెదకూరపాడు గ్రామం. మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో పెదకూరపాడుకు తరలించారు. పలువురు మార్కెటింగ్ శాఖ అధికారులు, సిబ్బంది, రైతుబజారులలోని షాపుల యజమానులు రవివర్మ మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

పాత పెన్షన్ విధానం కోసం ఉపాధ్యాయుల ఆందోళన

గుంటూరు ఎడ్యుకేషన్: పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ డిమాండ్‌తో 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. శనివారం డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కొరిటెపాడు నుంచి లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఫోరం జిల్లా కన్వీనర్లు సలగాల ప్రసన్న కుమార్, శీలం యలమంద మాట్లాడుతూ 2003 డీఎస్సీ ద్వారా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు సీపీఎస్‌కు బదులుగా పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేస్తూ కేంద్ర ప్రభుత్వం 57 మెమో ద్వారా విడుదల చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉపాధ్యాయుల చట్టబద్ధమైన హక్కును కాలరాస్తున్న కూటమి ప్రభుత్వానికి, మంత్రులకు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. ఆందోళనలో రాష్ట్ర కన్వీనర్ మోపిదేవి శివశంకర రావు, మారెళ్ల శ్రీనివాసరావు, ఆర్.శ్రీనాథ్, పూదోట శివప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ మేనేజర్‌గా శరత్ బాబు



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ మేనేజర్‌గా మండే శరత్ బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. రైల్వేస్టేషన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ పదోన్నతిపై స్టేషన్ మేనేజర్‌గా నియమితులయ్యారు.

వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: శనివారం కురిసిన వర్షానికి రోడ్ల మీద వర్షపు నీరు నిలబడకుండా ఎప్పటికప్పుడు మోటార్ల సాయంతో బెయిల్ అవుట్ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కేవీపీ కాలనీ, జోసఫ్‌నగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వర్షం వలన ఏమైన సమస్యలు వస్తే వెంటనే 0863-2345103 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. వర్షాల దృష్ట్యా కార్పొరేషన్ సిబ్బందికి సెలవులు రద్దు చేసినట్లు చెప్పారు. అధికారులు, సచివాలయం సెక్రటరీలు వర్షం తగ్గే వరకు విధుల్లో ఉండాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఏఈలను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇళ్లు, వ్యాపార వాణిజ్య సంస్థల వారు వ్యర్థాలను రోడ్లు, డ్రెయిన్లలో వేయవద్దని కమిషనర్ కోరారు. శనివారం జేకేసీ రోడ్, అరండల్ పేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

• మర్యాదపూర్వక కలయిక



అంబటి రాంబాబును సత్కరిస్తున్న నాయకులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబును ఇటీవల నూతనంగా పార్టీలో పదవులు పొందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థ నగర్‌లోని ఆయన కార్యాలయంలో పార్టీ మహిళ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన భుక్యా శాలిని, పశ్చిమ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన కానూరు శశిధర్ పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు బొక్క అగస్టీన్, యువజన విభాగం నాయకులు పులివర్తి మణిధర్, రూపేష్, సంతోష్, సతీష్, గోపి, గణేష్, జాన్సన్, వీరయ్య పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పిడతల భానుప్రకాష్, సిద్ధార్థనగర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

సుబ్రహ్మణ్యానికి గాయత్రీ సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం



సుబ్రహ్మణ్యంను బిరుదుతో సత్కారం

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం గాంధర్వామృత వర్షిణి డాక్టర్ జి.శారదా సుబ్రహ్మణ్యం(విశాఖపట్నం) శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. తొలుత ఆలయ పాలకమండలి, సంస్థ నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలన చేయగా, మాధవపెద్ది మీనాక్షి సభాధ్యక్షత వహించారు. అనంతరం ఆమెకు గాయత్రీ సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఏంవై శేషురాణి, వీవీఐటీ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, డాక్టర్ నల్లపాటి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, పాటిబండ్ల లలితాదేవి, కార్యదర్శి ఏవీ.మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

భానుమతికి ఘన నివాళి

లక్ష్మీపురం: సాటిలేని మేటి నటి కళా సామ్రాజ్ఞి బహుముఖ ప్రజ్ఞావతి భానుమతి అని సీనియర్ గాయని యార్లగడ్డ లక్ష్మి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థకార్యాలయంలో శనివారం పాడుదాం రండి బృంద సభ్యుల ఆధ్వర్యంలో శనివారం భానుమతి జయంతి నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.